


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 23 | మంగళవారం 23 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## దుందుభి వాగు పై రూ.20 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి మంత్రి శంకుస్థాపన

- మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పట్టుదలతోనే చిరకాల కల సాకారం
- మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం
- నాగర్‌కర్నూల్ అభివృద్ధికి మరిన్ని నిధులు అందిస్తాం
- రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క



వార్త సాక్ష్యం జూన్ 22 మహబూబ్‌నగర్ బ్యూరో : నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండలం సిర్సివాడ గ్రామం వద్ద దుందుభి వాగుపై రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మిగతా2లో

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి



-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన..

-చింతకాని మండలంలో సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లకు అనువైన స్థలాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం..

వార్త సాక్ష్యం జూన్ 22 ఖమ్మం: ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించ నున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాల ను సందర్శించి సమగ్రంగా పరిశీలిం చారు. మిగతా2లో

## బొగ్గు టిప్పర్ ఢీకొని భూపాలపల్లి డీటీఓ వెంకన్న దుర్మరణం

### జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



వార్త సాక్ష్యం జూన్ 22

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ ఉదయం ఒక అత్యంత దారుణమైన రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రభుత్వ విధుల్లో భాగంగా రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి బి. వెంకన్న (45) ను ఒక బొగ్గు టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ మిగతా2లో

## డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టిప్పర్ ఢీకొని డీటీఓ వెంకన్న దుర్మరణం

విచారణ జరపాలంటూ రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌కు రేవంత్ ఆదేశం

వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని సీఎం హామీ

వార్త సాక్ష్యం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధి నిర్వహణలో ఉండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం. వెంకన్న ఘోర మరణం చెందిన ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మిగతా2లో



## డీటీఓ వెంకన్న మృతిపై హరీశ్‌రావు అనుమానాలు!

- తనిఖీలు నిర్వహిస్తుండగా డీటీఓ వెంకన్నను ఢీకొన్న టిప్పర్
- అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన వెంకన్న
- అక్రమాలను అడ్డుకుంటే లారీలతో తక్కించి చంపేస్తారా? అని ప్రశ్నించిన హరీశ్

## రేపటి రోజున సమాజ సేవలో మేటి ఎవరంటే బాలకృష్ణ దానికి చిరునామాగా నిలుస్తారు



వార్త సాక్ష్యం జూన్ 22

హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రి చైర్మన్, తన బావమరిది అయిన నందమూరి బాలకృష్ణపై ప్రశంసల వర్షం కురిపించారు. "మొన్నటి వరకు సినిమాల్లోనే చప్పట్లు కొట్టించుకున్న బాలకృష్ణ, రేపటి రోజున సమాజ సేవలో ఎవరు మేటి అంటే దానికి చిరునామాగా నిలుస్తారు" అని చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రులు దామోదర రాజనర్సింహ, సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. ఆసుపత్రి ఏర్పాటు వెనుక ఉన్న నేపథ్యాన్ని, తన అత్తగారైన బసవతారకం గారు క్యాన్సర్‌తో పడిన బాధను చంద్రబాబు భావోద్వేగంతో - మిగతా2లో




## ఢిల్లీలో మీకు స్పెషల్ ట్రీట్మెంట్ నిజమేనా? అంటూ ఆర్నాబ్ గోస్వామి ప్రశ్న...

వార్త సాక్ష్యం జూన్ 22

కేంద్రంలో ఎన్డీయే కూటమిలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న నేపథ్యంలో, ఢిల్లీలో ఆ పార్టీకి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందన్న ప్రచారంపై ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టత ఇచ్చారు. న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ నిర్వహించిన కాంక్లేవ్‌లో ఎడిటర్-ఇన్-చీఫ్ ఆర్నాబ్ గోస్వామి అడిగిన సూటి ప్రశ్నకు ఆయన అంతే సూటిగా, వివరణాత్మకంగా సమాధానమిచ్చారు. "ఎన్డీయేలో మీరే అతిపెద్ద మిత్రపక్షం కాబట్టి, మీకు ఢిల్లీలో స్పెషల్ ట్రీట్‌మెంట్ లభిస్తోందన్న ప్రచారం నిజమేనా?" అని ఆర్నాబ్ ప్రశ్నించారు. దీనిపై లోకేశ్ బదులిస్తూ, "ఆర్నాబ్ జీ, ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల మన మాట గట్టిగా వినిపించడానికి కచ్చితంగా ఉపయోగపడుతుంది. కానీ దానివల్ల రాష్ట్రానికి, నాకు వ్యక్తిగతంగా ఏం లాభం కలిగింది? ప్రధాని నరేంద్ర మోదీ గారితో కలిసి డిన్నర్ చేసే అవకాశం దొరికింది. ఆయన ఎంతో ప్రేమగా ఆతిథ్యం ఇచ్చారు. ఆయన దార్శనికత ఏంటో నాకు అర్థమైంది. కేంద్రం అద్భుతమైన పాలసీలు తీసుకొస్తుంటే, వాటిని అమలు చేయాల్సింది రాష్ట్రాలే. ఆ విషయంలో ఏపీ వేగంగా ముందుకెళుతోంది, అందుకే మాకు గుర్తింపు వస్తోంది" అని తెలిపారు. - మిగతా2లో

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 23 జూన్, 2026

# దుందుభి వాగుపై రూ.20 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి మంత్రి శంకుస్థాపన



దుందుభి వాగుపై రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనురుద్ రెడ్డి, తో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క (ధనసరి అనసూయ) సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి కలను సాకారం చేయడంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అసాధారణమైన పట్టుదలతో కృషి చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రశంసించారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటి సాధన కోసం నిరంతరం శ్రమించే నాయకులు సమాజానికి ఎంతో అవసరమని, అలాంటి నాయకులను ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని మంత్రి సీతక్క తెలిపారు. సిర్సవాడ గ్రామం వద్ద దుందుభి వాగుపై రూ.20 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ...., ఈ వంతెన నిర్మాణం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, వేలాది మంది ప్రజల జీవితాలను సులభతరం చేసే చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల నేడు నిజమవుతుండడం ఆనందంగా ఉందని బ్రిడ్జి నిర్మాణానికి నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి, ప్రజలకు జన్మదిన కానుకగా ఈ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ప్రత్యేక అభినందనలకు అర్హులని కొనియాడారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో నాగర్‌కర్నూల్, జడ్చర్ల నియోజకవర్గాల మధ్య అనుసంధానం మరింత బలపడుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో దుందుభి వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర సేవలు పొందాల్సిన ప్రజలందరికీ ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. వాగులపై వంతెనలు లేకపోతే గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంతటి కష్టాలు పడతారో తనకు బాగా తెలుసని మంత్రి చెప్పారు. తాను కూడా అడవి ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ప్రజల ఇబ్బందులను దగ్గరగా చూసిన అనుభవం తనకు ఉందన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం లక్ష్యం**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి వివరించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. మహిళలు అందరూ స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న స్థాయి వ్యాపారాల నుంచి పెద్ద స్థాయి పరిశ్రమల వరకు మహిళలు ముందుకు రావాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళల అభివృద్ధినే రాష్ట్ర అభివృద్ధిగా భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని మంత్రి తెలిపారు.

**రాజేష్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి**

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఒకేరోజు సుమారు 8 వేల మహిళా భవనాలకు శంకుస్థాపన జరగడం దేశంలోనే ఒక చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. ప్రస్తుతం ఆ భవనాల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలు జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలకు వచ్చినప్పుడు వసతి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా మహిళా భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒక్కో భవనానికి సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలు, సమావేశ మందిరాలు, శిక్షణ కేంద్రాలు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా ఈ భవనాలు ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలో కూడా రాణించాలని కోరారు. ముఖ్యంగా హైదరాబాద్--శ్రీశైలం జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పర్యాటకం, ఆహార ఉత్పత్తులు, చేతివృత్తులు, సేవా రంగాల్లో వ్యాపార అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి తెలిపారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి

అనంతరం జగనాథపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాల ను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని సభా ప్రాంగణం వద్ద మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ



సమావేశంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండి వరుణ్ రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో మీకు స్పెషల్ ట్రీట్మెంట్ నిజమేనా? అంటూ ఆర్నాబ్ గోస్వామి ప్రశ్న...

రాష్ట్ర ప్రభుత్వ పనితీరు వేగాన్ని వివరిస్తూ, "ఇతర రాష్ట్రాలు ఆలోచిస్తున్నప్పుడు, నేను రక్షణ మంత్రి వద్దకు వెళ్లి 'మాకు ప్రాజెక్ట్ ఇవ్వండి, భూమి సిద్ధంగా ఉంది' అని అడిగితే ఆయన ఎందుకు కాదంటారు? కేవలం 37 రోజుల్లో 600 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఇచ్చింది. ఇదే మా స్పీడ్. వేగంగా పనిచేసే రాష్ట్రాల వైపే ప్రధాని కూడా చూస్తున్నారు. రాష్ట్రాలు పోటీ పడితేనే దేశం గెలుస్తుందని నా నమ్మకం" అని లోకేశ్ అన్నారు.

**చంద్రబాబే ఐటీ, ఆయనే ఏఐ**

చంద్రబాబు ఐటీకి బ్రాండ్ అయితే, మీరు ఏఐకి బ్రాండ్‌గా మారుతున్నారా అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు లోకేశ్ చమత్కరిస్తూ, "మా ముఖ్యమంత్రి గురించి తెలిసిన వారికి అర్థమవుతుంది, ఆయన మాకు ఎలాంటి క్రెడిట్ వదిలిపెట్టరు. ఐటీ ఆయనే, ఏఐ ఆయనే, క్వాంటం కూడా ఆయనే. ఆయన చూపిన మార్గంలో పనులు పూర్తి చేయడమే నా కర్తవ్యం. చంద్రబాబు ఒక బ్రాండ్. ఆ బ్రాండ్ వల్లే గూగుల్ వంటి సంస్థల తలుపులు మాకు తెరుచుకున్నాయి. ఏడాదిలోపు డేటా సెంటర్‌ను దేశానికి అంకితం చేస్తాం" అని తెలిపారు. 'చంద్రబాబు నాయుడు 4.0' పాలన మునుపటి మూడు టర్మ్‌ల కంటే భిన్నంగా ఉంటుందని, 2024 బృందం అత్యద్భుతంగా పనిచేసిందని సీఎం చేత అనిపించుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**అభివృద్ధి, వనరుల సమతుల్యత**

డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్ వల్ల స్థానిక అవసరాలకు ఇబ్బంది కలుగుతుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ, "ప్రతి ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీల నీరు సముద్రంలో వృథాగా కలుస్తోంది. డేటా సెంటర్లకు కావాల్సింది కేవలం 1.5 టీఎంసీలు మాత్రమే. పోలవరం పూర్తయ్యాక ఈ నీటిని వాడుకుంటాం. ఇక విద్యుత్ విషయానికొస్తే, రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ పుష్కలంగా ఉంది. 'వన్ గ్రిడ్' విధానం ద్వారా సరఫరా చేస్తాం" అని వివరించారు.

**రియల్-టైమ్ గవర్నెన్స్**

రియల్-టైమ్ గవర్నెన్స్ అనేది మార్కెటింగ్ పదం కాదని, దాని ద్వారానే పాలనలో పారదర్శకత సాధ్యమని లోకేశ్ అన్నారు. "గత ఐదేళ్లలో పర్యవేక్షణ లోపించి రాష్ట్రంలో అక్షరాస్యత పడిపోయింది. కానీ ఇప్పుడు రియల్-టైమ్ డేటా ద్వారా ఏ పాఠశాలలో ఏ విద్యార్థి వెనుకబడ్డాడో అమరావతిలో కూర్చొని నేను తెలుసుకోగలను. ఈ పర్యవేక్షణ వల్లే ఈ ఏడాది 85,000 మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చారు" అని ఉదహరించారు.

**రాజకీయ ప్రవేశంపై ఆసక్తికర వ్యాఖ్యలు**

రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారని ఆర్నాబ్ అడగ్గా, లోకేశ్ ఒక ఆసక్తికరమైన సంఘటనను పంచుకున్నారు. "2004లో ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన ఏడాది తర్వాత, మా నాన్నగారితో ఒక పెళ్లికి వెళ్లాను. అక్కడ ఉన్న 5,000 మంది ఆయన రాగానే లేచి నిలబడి గౌరవం ఇచ్చారు. పదవిలో లేకపోయినా ప్రజలు ఇచ్చే ఆ గౌరవాన్ని చూశాక, రాజకీయాల్లోనే అంతటి గౌరవం దక్కుతుందని అర్థమైంది. అదే నన్ను రాజకీయాల వైపు నడిపించింది" అని లోకేశ్ తన రాజకీయ ప్రవేశం వెనుక ఉన్న స్ఫూర్తిని వివరించారు. ఈ సంభాషణ ముగింపులో ఆర్నాబ్ గోస్వామి, లోకేశ్‌ను దేశం గమనిస్తున్న యువ నాయకుడిగా ప్రశంసించారు.

## బొగ్గు టిప్పర్ ఢీకొని భూపాలపల్లి డీటీఓ వెంకన్న దుర్మరణం!

ప్రభుత్వ విధుల్లో భాగంగా రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి (ఇూా) బి. వెంకన్న (45) ను ఒక బొగ్గు టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన జిల్లా అధికార యంత్రాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే... గణపురం మండలం చెల్పూర్ శివారులోని ప్రాంతీయ రవాణా శాఖ (=ఖా) కార్యాలయం ఎదుట, ఆర్డీవో ఆఫీస్ సమీపంలో డీటీఓ వెంకన్న తన సిబ్బందితో కలిసి ఉదయం రెగ్యులర్ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల నుండి బొగ్గు లోడ్‌తో పరకాల వైపు అతివేగంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ అదుపుతప్పి.. వెనుక నుంచి నేరుగా వెంకన్నపైకి దూసుకెళ్లింది. లారీ వేగానికి డీటీఓ వెంకన్న శరీరం పూర్తిగా నుజ్జునుజ్జయి రోడ్డుపై పడిపోయింది. కళ్లెదుటే జరిగిన ఈ ఘోర ప్రమాదాన్ని చూసి తోటి రవాణా శాఖ సిబ్బంది, స్థానికులు తీవ్ర షాక్‌కు లోనయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వెంకన్న.. గతంలో జగిత్యాల జిల్లాలో పనిచేశారు. అక్కడి నుండి కేవలం 15 నుండి 20 రోజుల క్రితమే ఆయన భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి డీటీఓగా బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన కొన్ని రోజుల్లోనే ఆయన ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో కోలుకోలేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

## డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది. వెంకన్న మృతి పట్ల సంతాపం ప్రకటించిన సీఎం.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు.ప్రమాదం వివరాల్లోకి వెళితే... ఈ ఉదయం గణపురం మండలం చెల్పూరు శివారులో వాహనాలను తనిఖీలు చేస్తుండగా బొగ్గు లోడ్‌తో వెళుతున్న టిప్పర్ లారీ వెంకన్నపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

## డీటీఓ వెంకన్న మృతిపై హరీశ్‌రావు అనుమానాలు!

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి (ఇూా) వెంకన్న దుర్మరణం చెందిన ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ రోడ్డు ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మరణం కేవలం ఒక యాక్సిడెంట్ మాత్రమే కాదనే బలమైన సందేహాన్ని హరీశ్‌రావు లేవనెత్తారు. "రాష్ట్రంలో అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియాల ఆటలు మితిమీరిపోయాయి. నిజాయతీగా పనిచేసే అధికారులు వారి అక్రమాలకు అడ్డొస్తే... ఇలా లారీలతో తొక్కించి ప్రాణాలు తీస్తారా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. భూపాలపల్లి ఏరియాలో సాగుతున్న అక్రమ ఇసుక, బొగ్గు రవాణా వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరు? వారికి సహకరిస్తున్న లీడర్స్ ఎవరు? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వెంకన్న ప్రమాదం వెనుక దాగిన నిజాన్ని పూర్తిగా వెలికితీయాల్సిన బాధ్యత ముమ్మాటికీ రాష్ట్ర సర్కార్ పైనే ఉందన్నారు. కేవలం డ్రైవర్‌ను అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటే కుదరదని... ఈ కేసుపై ఒక ఉన్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి, దీని వెనుక ఎవరి ప్రేరేపణ అయినా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేయాలన్నారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించడంతో పాటు, భవిష్యత్తులో విధుల్లో ఉండే అధికారులకు ఇలాంటి దారుణాలు జరగకుండా పకడ్బందీ రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## రేపటి రోజున సమాజ సేవలో మేటి ఎవరంటే బాలకృష్ణ దానికి చిరునామాగా నిలుస్తారు: సీఎం చంద్రబాబు

ఆనాడు ఎన్టీఆర్ గారు ప్రభుత్వం తరఫున భూమి కేటాయించినప్పటికీ, 1989లో ప్రభుత్వం మారడంతో ఆసుపత్రి నిర్మాణం ముందుకు సాగలేదని, మళ్లీ 1996-97 వరకు దానిపై దృష్టి పెట్టలేకపోయామని తెలిపారు. దివంగత కోడెల శివప్రసాదరావు, ఎన్ఆర్ఐల సహకారంతో ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామన్నారు. "తండ్రి ఒక మొక్క నాటితే, కొడుకుగా బాలకృష్ణ బాధ్యత తీసుకుని దాన్ని ఒక మహా కల్పవృక్షంగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది" అని చంద్రబాబు కొనియాడారు. ఒకానొక దశలో సంస్థ మనుగడపైనే అనుమానాలు వచ్చినప్పుడు, 15 ఏళ్ల క్రితం బాలకృష్ణకు బాధ్యతలు అప్పగించామని, అప్పటి నుంచి ఈ వ్యవస్థను 'అన్‌స్టాపబుల్'గా ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. సినిమాల్లో ఎవర్ గ్రీన్ హీరోగా, హిందూపురం ఎమ్మెల్యేగా తీరిక లేకుండా ఉన్నప్పటికీ, క్యాన్సర్ రోగుల పట్ల ఆయన చూపే కరుణ, సేవ చేయాలన్న తపనే ఈ సంస్థను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. ప్రారంభంలో 100 పడకలతో మొదలైన ఆసుపత్రి, నేడు 650 పడకల స్థాయికి పెరిగిందని, 250 మందికి పైగా నిపుణులైన వైద్యులతో సేవలందిస్తోందని చంద్రబాబు వివరించారు. ఏటా 3 లక్షల మందికి పైగా ఔట్ పేషెంట్లకు, 90 వేల మంది ఇన్ పేషెంట్లకు సేవలు అందిస్తూ, సంవత్సరానికి 8,000 ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. అమరావతిలో 1000 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు బాలకృష్ణ, యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని, దాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని ప్రకటించారు. ప్రభుత్వాలు మాత్రమే ప్రజారోగ్యాన్ని కాపాడలేవని, లాభాపేక్షతో నడిచే ప్రైవేటు ఆసుపత్రుల మధ్య, బసవతారకం వంటి లాభాపేక్ష లేని సంస్థలు (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్) మరిన్ని రావాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. తల్లి పేరుతో బాలకృష్ణ, తండ్రి పేరుతో భువనేశ్వరి (ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్) సేవా కార్యక్రమాలు చేయడం ఎన్టీఆర్ కుటుంబం యొక్క విశిష్టత అని పేర్కొన్నారు. డబ్బు సంపాదించే అవకాశాలున్నా, పేదలకు సేవ చేయడంలోనే వారు ఆనందాన్ని వెతుక్కుంటున్నారని అన్నారు. బాలకృష్ణ నాయకత్వంలో రాబోయే 25 ఏళ్లలో బసవతారకం దేశంలోనే నంబర్ వన్ నాన్-ప్రాఫిట్ సంస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి పనికి విరాళాలు ఇవ్వాలనుకునే వారికి ఇది ఉత్తమ వేదిక అని సూచిస్తూ, 50వ వార్షికోత్సవాన్ని కూడా ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 23 జూన్, 2026

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం వారోత్సవాలు

- మండల వ్యవసాయ శాఖ అధికారిని కే. హేమలత



ఆత్మకూరు జూన్ 21 వార్త సాక్ష్యం

రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కరివేన గ్రామంలో సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారిని హేమలత గ్రామా రైతులతో సందర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వర్షబావ పరిస్థితుల కారణంగా ఎల్ నినో ప్రభావం పంటలపై ఉంటుందని రైతులు బెట్ట పరిస్థితులను తట్టుకునే పంటలను. పప్పుధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా మరియు డిఏపి ఎరువుల పంపిణీ విధానాన్ని యాప్ యొక్క ప్రాధాన్యతను రైతులకు వివరించారు అనంతరం ఆత్మకూరు ఉద్యానవన శాఖ అధికారిని చందన మాట్లాడుతూ ఉద్యానవన శాఖ యొక్క పథకాలను రైతులు సద్వినియం చేసుకోవాలని తెలియజేశారు కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేంద్రుడు, వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు అశోక్ కుమార్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షటిల్ క్రీడల్ని సద్వినియోగం చేసుకోండి

- ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నా
- ఈ నెల 25వ తేదీ నుంచి వంద రోజుల పాటు జరిగే కార్యక్రమం

ఆత్మకూరు జూన్ 21 వార్త సాక్ష్యం




శ్రీ శైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఆత్మకూరు పట్టణం లోని ఎన్టీఆర్ కేవీకే స్టేడియం లో ఈనెల 25వ తేదీ నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7:30 వరకు ఉచితంగా షటిల్ శిక్షణ (ఇండోర్ ఫ్లడ్ లైట్ లలో) ఇస్తున్నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. సోమవారం విలేకరుల కు తెలిపారు ఈ సందర్భంగా షటిల్ శిక్షకులుగా ఆత్మకూరు పట్టణానికి చెందిన జాతీయ షటిల్ క్రీడాకారుడు ఖాజా హుస్సేన్ నియమించినట్లు తెలిపారు. 100 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని అన్నారు ఆత్మకూరు పట్టణ, గ్రామీణ పరిసర ప్రాంతంలోని 8 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల వరకు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. పిలుపునిచ్చారు ఈ కార్యక్రమానికి అన్ని విధాలుగా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే. బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ శిక్షకులు ఉపేంద్ర తైక్వాండో శిక్షకులు స్వామన్న తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి వినతిపత్రం
- ఏఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై పోరాటం



ఆత్మకూరు జూన్ 21 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు సమస్యల పరిష్కారం కోసం సిపిఐ, పార్టీ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు శెట్టి వేణుగోపాల్ కు వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) రాష్ట్ర సమితి పిలుపుతో సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా ఏఐటియుసి పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి. ప్రతాప్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే నియోజకవర్గ ఎమ్మెల్యేకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేయడం జరిగిందని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల ప్రధాన డిమాండ్లు:

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా కూటమి నేతలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సిపిఐ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ నాయకులు అన్నదాసు బిసన్న, దూద్ పిరా, కార్మికులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించాలి

- మున్సిపల్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న పీఎఫ్ చెలించాలి

ఆత్మకూరు జూన్ 21 వార్త సాక్ష్యం



మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అన్నారు. సోమవారం పాత మున్సిపల్ కార్యాలయం దగ్గర ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐటియు నాయకులు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు 2016 నుంచి పెండింగ్ లో ఉన్న పీఎఫ్ కార్మికుల అకౌంట్లో జమ చేయాలన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో పట్టణ ప్రజలకు కుళాయిల ద్వార నీరు, ఎలక్ట్రికల్ సదుపాయం కల్పిస్తూ, ఎలాంటి అంటువ్యాధులు సంభవించకుండా ఆత్మకూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జి ఓ ఆర్ టి నెంబర్ 1615 ప్రకారం పిఆర్సి జీతాలు చెల్లింపు చేయాలన్నారు. కరువు భత్యం, మధ్యంతర భృతి ఇవ్వాలి, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు ఇవ్వాలన్నారు. పదవి విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, అధ్యక్షులు సద్దాం, మున్సిపల్ కార్మికులు తిమ్మాయ్య, గౌడుగు రాజు, సువర్ణమ్మ, సుగుణమ్మ, నరసింహుడు, రాజేంద్ర, సన్ని, రవి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు మహిళల రక్షణ కోసమే శక్తి యాప్...!

- ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్లో " శక్తి యాప్ పై అవగాహన
- ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన
- శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ షేక్ నూరు అహ్మద్

ఆత్మకూరు జూన్ 21 వార్త సాక్ష్యం



పట్టణంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరన్ ఐపీఎస్ ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్. రామాంజి నాయక్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు "శక్తీ టీం" హెడ్ కానిస్టేబుల్ షేక్.నూర్ అహమ్మద్ మహిళా పోలీస్ సుప్రియ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని కురుకుంద జడ్పీఎస్ హెచ్ హై స్కూల్ మండల విద్యాశాఖ అధికారి ఆదేశాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి సహకారంతో ఉపాధ్యానీ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు "శక్తీ యాప్ " పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ షేక్ నూర్ అహ్మద్ మాట్లాడుతూ ఆడపిల్లలు మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన " శక్తి యాప్ " యొక్క ఉపయోగాలు విద్యార్థులకు తెలియజేశారు అత్యవసర పరిస్థితులలో శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తున్నట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని చెప్పారు. ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకే ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ పేరెంట్స్ వాట్స్ అప్ లకు ఎవరైనా పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని చెప్పారు సైబర్ నేరాలకు గంజాయి నాటు సారా వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా తల్లిదండ్రుల ఆశయాల కోసం కష్టపడి చదివి మంచి ఉన్నత శిఖరాలకు చేరు కోవాలని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ షేక్ నూర్ అహ్మద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు శక్తి టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుద్యాల గ్రామంలో దళిత కాలనీలకు నీటి సమస్యను అధికారులు పరిష్కరించండి

- మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

కొత్తపల్లి జూన్ 21 వార్త సాక్ష్యం




కొత్తపల్లి మండల పరిధిలోని దుద్యాల దళిత కాలనీలైన మాల మాదిగ పేటలకు మంచినీటి సమస్య ఉండబట్టి దాదాపు నాలుగైదు రోజులు అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు టిడిపి నాయకుల దగ్గరికి వెళితే మా దుద్యాల గ్రామాన్ని నాయకులు రెండుగా పంచుకున్నాము ఆ ఏరియా అభివృద్ధి పనులు సమస్యల గురించి మాకు కాదు అని ఒక నాయకుడు ఇంకొక నాయకు డేమో నాకు ఇచ్చిన ఏరియాలో నేను సస్యశ్యామలంగా సమస్యలు తీరుస్తున్నానని ఇంకొక నాయకులు చెబుతూ ఒకరి మీద ఒకరు చెప్పుకొనుచున్నారు మరి ఎమ్మెల్యే గారు దయచేసి దళిత కాలనీవాసులకు ఏ నాయకుని నియమించినారో తెలియచేయాలని కోరుచున్నాము అధికారులేమో నాయకులకు చెప్పమని అని చెబుతూ ఉన్నారు ఓసి కాలనీలకు వెళ్లే బోరు మోటర్లకేమో 24 అవర్స్ విద్యుత్ కనెక్షన్స్ ఇచ్చారు మరి దళితుల కాలనీలకు వెళ్లే బోర్లాకి ఏమో అరకొర కరెంటు ఉండే లైన్ కు ఇచ్చి నారు అలాగే దళిత కాలనీలో ఉన్న చేతి పంపు కూడా రిపేర్ అయి నెల రోజులు అవుతున్న దాన్ని కూడా రిపేరు చేయించలేదు అందుకని సోమవారం స్పందన కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీకి తాగునీటి సమస్యల గురించి చేతి పంపు రిపేరు గురించి దళితులని వివక్షత చూపకుండా ఓసి కాలనీలకు వెళ్లే బోర్లకు ఇచ్చిన 24 అవర్స్ కరెంటు కనెక్షన్ ను దళిత కాలనీలకు వెళ్లే బోర్లకు కూడా ఇవ్వాల్సిందిగా అర్జీ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో మాల మహానాడు తాలూకా కమిటీ నాయకులు ప్రాతకోట. రమేష్ మద్దెల భాస్కర్. దారా లోకేష్ చంద్రశేఖర్ జయరాజు ఎమ్మార్పీఎస్ నాయకులు ఈరగాళ్ల సుదర్శనం దళిత కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థానంలో ఐదు కోట్లకు పైగా హుండీల ఆదాయం



- భక్తాదుల కానుకలతో ఆలయ అభివృద్ధి శ్రీకారం
- హుండీల లెక్కింపులో పర్యవేక్షణ చేసిన ఆలయ ఈవో
- ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం
- దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి ఎం. శ్రీనివాసరావు

శ్రీశైలం జూన్ 21 వార్త సాక్ష్యం



సోమవారం శ్రీశైల దేవస్థానంలో జరిగిన హుండీల లెక్కింపులో దేవస్థానానికి ఐదు కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహన అధికారి శ్రీనివాసరావు తెలిపారు ముందుగా ఆలయ ప్రాంగణంలో హుండీల లెక్కేస్తున్న ప్రాంతాన్ని పర్యవేక్షణ చేశారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆలయ ఈవోమాట్లాడుతూ హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 5,45,55,035 /-లు నగదు ఆదాయం అధికంగా వచ్చిందని తెలిపారు ఈ హుండీల రాబడిని భక్తులు గత 27 రోజుల హుండీ ఆదాయం వివరాలను వెల్లడించారు. అలాగే ఈ హుండీలో 127 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారు, 3 కేజీల 680 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 392 - యుఎస్ఏ డాలర్లు,10,105 యు.ఏ.ఇ దిర్హమ్స్, 17-సౌది రియాల్స్, 38- సింగపూర్ డాలర్లు, 5 ఇంగ్లాండు పౌండ్స్ , 18 మలేషియా రింగిట్స్ , 160 ఆస్ట్రేలియా డాలర్లు, 40 యూరోస్, 10 కెనడా డాలర్లు, 11 కత్తారు రియాల్స్, 3 ఓమన్ రియాల్స్, 100 - ఓమన్ బైసాలు మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో ఉన్నాయని తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగిందని చెప్పారు. ఈ హుండీల లెక్కింపులో హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి సభ్యులు జి. లక్ష్మేశ్వరి, జి. గంగమ్మ, కె. కాంతివర్ధిని, చిలువేరు కాశీనాథ్, ఉప్పుటూరి. సుబ్బలక్ష్మి, పి.యు.శివమ్మ, జి.శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితు లుగా బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, వాయుగండ్ల వెంకటేశ్వర్లు హుండీల లెక్కింపు ను పరిశీలించారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు.

# లక్ష్యంతో కూడిన ప్రణాళికలు రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించాలి

## ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష

- జిల్లాలోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి
-రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్

జూన్ 22 వార్త సాక్ష్యం జగిత్యాల:



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలు పై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సోమవారం జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పూర్తిగా అందాయా అని ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, బోధన నిర్వహణ పై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న ఆమె, గత సంవత్సర ఎస్ఎస్సి ఫలితాల పై జిల్లా విద్యాశాఖాధికారి నుండి సమాచారం సేకరించారు. అనంతరం పాఠశాలలోని డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించారు. ఎం.డీ.ఎం నిర్వాహకులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించిన ఆమె, మధ్యాహ్న భోజన పథక నిర్వహణలో ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు. చివరగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యను జీవితం లో అత్యంత విలువైన సంపదగా భావించి క్రమశిక్షణ తో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని సిక్త పట్నాయక్ ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు. తదుపరి మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరియు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం గురించి వివరాలు తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్లను సందర్శించి పరిశీలించి, ఇళ్లు ఎంతో నాణ్యంగా మరియు ఆకర్షణీయంగా నిర్మించబడినట్లు అభినందించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను కూడా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, డిపిఓ మదన్మోహన్, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

- జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్ 2026 ప్రారంభించిన జిల్లా ఎస్పి

జూన్ 22 వార్త సాక్ష్యం జగిత్యాల:




పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా 3వ పోలీస్ డ్యూటీ మీట్ 2026 కార్యక్రమాన్ని ఎస్పీ అదనపు ఎస్పితో కలిసి ప్రారంభించారు. పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు. పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహన తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అదికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు. ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, మరియు కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రవి, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, వేణు, ఎస్. ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పై అవగాహన కల్పిస్తూ ఉత్సాహంగా సాగిన 2 కే రన్





జూన్ 22 వార్త సాక్ష్యం ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి :

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ,'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ ఐ ఆర్)పై అవగాహన కోసం జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి నిర్వహించిన ప్రత్యేక "2 కే రన్"ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు."స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కోసం పరుగెత్తుదాం" అనే నినాదంతో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ప్రారంభమై కలెక్టరేట్ చౌక్,ఎన్టీఆర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియం వద్దకే చేరుకుంది.2కే రన్ విజేతలకు ప్రశంస పత్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అధికారులతో కలిసి అందజేశారు.అనంతరం మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా 'నషా ముక్త్ భారత్'ప్రచారంలో భాగంగా మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనలు కలెక్టర్ మాట్లాడుతూ... ఓటరు మ్యాపింగ్ పక్రియ, 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని అన్నారు. గతంలో 2002 నాటి ఓటర్ల గణన ఆధారంగా ప్రస్తుతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, ప్రజల ఇండ్ల వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లు అడిగే వివరాలను అందించాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి ఇవ్వడం ద్వారా ఓటర్లు తమ ఓటును భద్రపరుచుకోవాలని కోరారు.ఎన్నికల సంఘం ప్రతి 20 ఏళ్లకు ఒకసారి ఈ విధమైన ప్రత్యేక సవరణ ప్రక్రియను చేపడుతుందని,దీనివల్ల అనవసరంగా ఓట్లు తొలగిపోతాయనే అపోహలు ఎవరూ పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. దీనితో పాటు సమాజంలో పెరిగిపోతున్న వ్యసనాలకు వ్యతిరేకంగా యువతకు అవగాహన కల్పించేందుకు'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. యువత గంజాయి, కొకైన్ వంటి మత్తుపదార్థాల బారిన పడకుండా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కుటుంబాల్లో గాని, గ్రామాల్లో గాని ఎవరైనా వీటికి బానిసలైతే ఆ సమాచారాన్ని అందించి, వారిని డీ-ఎడిక్షన్ సెంటర్లకు పంపించి పునరావాసం కల్పించడం ద్వారా మళ్లీ వారు సంతోషకరమైన జీవితాన్ని గడిపేలా ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డిడబ్ల్యుఓ మిల్కా, డిఈఓ మాధవి, డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, డిఎంహెచ్ఓ సాధన, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, తహసిల్దార్ శ్రీనివాస్, యువత, పట్టణ ప్రముఖులు, ఇతర అధికారులు ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీయుడబ్ల్యుజె సాధించిన కృషి ఫలితంగా జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ జీవో విడుదల

- యూనియన్ నాయకులకు ఉత్తర్వులు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా
- ధన్యవాదాలు తెలిపిన యూనియన్ నాయకులు



నంద్యాల, జూన్ 22 వార్త సాక్ష్యం

ఏపీయుడబ్ల్యుజె సాధించిన కృషి ఫలితంగా జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ ఉత్తర్వుల కాపీని సోమవారం యూనియన్ నాయకులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యామ్ సుందర్ లాల్, జిల్లా అధ్యక్షులు మధుబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ భాషాలు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని జిల్లాకలెక్టర్ రాజకుమారి గనియాకు ఏపీయుడబ్ల్యుజె ఆధ్వర్యం లో గత సోమవారం నాడు పిజిఆర్ఎస్ లో వినతిపత్రం అందజేశామని, తిరిగి నేడు సోమవారం అదే పిజిఆర్ఎస్ లో 50% ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తప్పక అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులకు 50% ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో యూనియన్ నాయకులు, పలువురు జర్నలిస్ట్ లు పాల్గొన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సోమవారం సంబంధిత ఉత్తర్వులను విడుదల చేయడం పట్ల జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం

- దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగంలో పాల్గొన్న గోళ్ళ రాజేష్





నంద్యాల జూన్ 22 వార్త సాక్ష్యం

పట్టణంలోని రోజాకుంటలో వెలిసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం నందు కళ్యాణ మండపం అధ్యక్షులు మేడం సుబ్బగురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగం సందర్భంగా భారత దేశ ప్రజలందరూ సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో నిర్వహించిన సుదర్శనయాగం నందు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ సోమవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవస్థాన అధ్యక్షుడు కమిటీ సభ్యులకు గోళ్ళ రాజేష్ ఇచ్చిన మాట ప్రకారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అధ్యక్షులు మేడం సుబ్బ గురుమూర్తి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు గోళ్ళ రాజేష్ ప్రసన్న వెంకటేశ్వర స్వామి,ఆలయంతో పాటు శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిచేందుకు గోళ్ళ రాజేష్ తనవంతు భాద్యతగా రోజా కుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం తో పాటు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధిలో తన సయంగా ఎల్లప్పుడు తోడ్పాటును అందిస్తానని ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కమిటీ పెద్దలకు హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు గొల్ల వెంకటలక్ష్మి, సెక్రటరీలు జీలా శైలజ, ఇటికాల చంద్రమౌళీశ్వర గుప్తా, అమరేష్,వెంకట సాయి కృష్ణ,వెన్నుపూస సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 23 జూన్, 2026

## సమిసిన కామారెడ్డి కాంగ్రెస్ ముఖ్య నేతల జగడం

- చేతులు కలిపిన షబ్బీర్, చంద్రశేఖర్ రెడ్డి చొరవ తీసుకున్న ఎంపీ మల్లు రవి
- ఇరువురు చేతులు కలపడంతో వివాదం సుఖాంతమైందని పార్టీ నేతలు హర్షం



జూన్ 22 వార్త సాక్ష్యం

కామారెడ్డి కాంగ్రెస్ ముఖ్య నేతల మధ్య వివాదం ఎట్టకేలకు సామరస్యం గా సమిసింది. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పార్టీ స్థానిక నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి చేతులు కలిపి, ఇకమీదట కలిసి నడుస్తామని పార్టీ క్రమశిక్షణా కమిటీ ముందు హామీ ఇచ్చారు. ఇరువురి మధ్య గత కొంత కాలంగా అధిపత్యపోరు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. పైగా షబ్బీర్ అలీ ఇటీవల చేసిన వ్యాఖ్యల ఆడియో వైరల్ అయ్యింది. పార్టీలో పదవులు అమ్ముకునే సంస్కృతి రావడం బాధాకరమని అన్నట్లు ఓ ఆడియో చక్కర్లు కొట్టింది. ఈ ఆడియోలో మహిళలనూ కించపరిచే వ్యాఖ్యలు ఉన్నాయని పిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ కూడా సీరియస్ అయ్యారని తెలిసింది. ఈ నేపథ్యంలో పిసిసి క్రమశిక్షణా కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి ఇరువురికీ షోకాజ్ నోటీసులు పంపిస్తూ కమిటీ ముందు హాజరు కావాలని ఆదేశించారు. దీంతో ఇరువురూ తమ అనుయాయులతో కలిసి గాంధీ భవన్‌కు చేరుకున్నారు.కమిటీ చైర్మన్ సభ్యులు ఇరుపక్షాల వాదనలు విని, మీరు ఇలా చేస్తే పార్టీకి నష్టమని, అధికారంలో ఉన్నందున ప్రభుత్వం పైనా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు స్టేషన్లకు వెళ్ళి ఫిర్యాదులు చేసుకోవడాన్నీ వారు తప్పు పట్టారు. ఇరుపక్షాలకూ వారు నచ్చజెప్పారు. దీంతో ఇకమీదట కలిసి పని చేస్తామని, కలిసి ముందుకు నడుస్తామని హామీ ఇస్తూ షబ్బీర్ అలీ, చంద్రశేఖర్ రెడ్డి చేతులు కలపడంతో కామారెడ్డి వివాదం సుఖాంతమైందని పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## కాచిగూడలో ఎల్ఐసీ ఉద్యోగి అదృశ్యం?

- అతని మొబైల్ ఫోన్ కు పలుమార్లు కాల్ చేసినప్పటికీ స్విచ్ ఆఫ్?
- ఆదివారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

జూన్ 22 వార్త సాక్ష్యం



ఎల్ఐసీ ఉద్యోగి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్ స్పెక్టర్ రాజశేఖర్ తెలి పిన వివరాల ప్రకారం నింబోలిఅడ్డ సంగం హోటల్ లేన్‌లో నివాసముం టున్న ముక్కెర మల్లేష్ కుమారుడు ముక్కెర మధుయాదవ్ (40) వృతి రీత్యా ఎల్ఐసీ కార్యాల యంలో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ ఉదయం 8.15గంటలకు తన ద్విచక్ర వాహనం ప్యాషన్(నంబర్:AP09Q0477) పై విధులకు వెళ్తున్నట్లు ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో తన తమ్ముడు అనిల్ యాదవ్‌కు ఫోన్ చేసి మీటింగ్ ఉండటంతో ఇంటికి ఆలస్యంగా వస్తానని తెలిపాడు. అయితే రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అతని మొబైల్ ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసిన ప్పటికీ స్విచ్ ఆఫ్‌గా రావడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభిం చలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం కాచిగూడ పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు.

## నూతన కమ్యూనిటీ భవనానికి భూమి పూజ రాష్ట్ర కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి

జూన్ 22 వార్త సాక్ష్యం మంచిర్యాల జిల్లా ప్రతినిధి :



మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో రూ.25 లక్షల సీఎస్ఆర్ (సి ఎస్ ఆర్) నిధులతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ భవనానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు,స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ భవనాలు ఎంతో ఉపయోగపడతా యని అన్నారు. సీఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం వినియో గించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావా లని అధికారులకు సూచించారు.ఈ భవనం స్థానిక ప్రజలకు సమా వేశాలు, సామాజిక కార్యక్రమాలు మరియు ఇతర ప్రజా అవసరాల నిర్వహణకు ఉపయోగపడనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి





- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జూన్ 22 వార్త సాక్ష్యం మంచిర్యాల జిల్లా ప్రతినిధి :

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్,ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.చెన్నూరు పట్టణానికి చెందిన లింగ కృష్ణ తాను టైల్స్, మార్బుల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని,అన్ లోడింగ్ సమయంలో హమాలీలు అధిక ధరలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దోమల చంద్రశేఖర్ తన కూతురు మందమర్రి లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసిందని, మంచిర్యాలలోని వసతి గృహానికి బదిలీ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామ రైతులు తమకు ముఖ్యమంత్రి గిరి వికాస్ పథకం కింద మంజూరైన బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన చిలుక పద్మ తాము ఉంటున్న రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాగంటి సౌభాగ్యవతి తాను భూభారతి పోర్టల్ లో పాస్ పుస్తకం వివరాల సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం అమరవాది కు చెందిన తోటపల్లి లత తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతానికి చెందిన గొట్టె నరేందర్ బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరిగాయని,ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన సముద్రాల శంకర్ తమ గ్రామంలోని చెరువుల పై జరిగిన అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్ధరిం చాలని, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, వైద్యాధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని,జిల్లా వ్యాప్తంగా 1 వేయి 836 సిబ్బంది 459 బూత్‌ల ద్వారా పోలియో చుక్కల పంపిణీ చేయడం జరుగుతు ందని తెలిపారు. పోలియో వ్యాక్సిన్ సురక్షిత మైనదని,అనారోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి జనిత,కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖల సమయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.జిల్లాను పోలియో రహిత,ఆరోగ్య మంచిర్యాలగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మమ్మల్నీ పంపించరూ? తెలంగాణలోని ఏపీ ఉద్యోగుల విజ్ఞప్తి

- 12 ఏళ్ల ఎదురుచూపుకు ఎట్టకేలకు మోక్షం.పరిష్కారం లభించే అవకాశం
- ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల ప్రక్రియ మళ్లీ తెరపైకి?

జూన్ 22 వార్త సాక్ష్యం



ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఏపీలో పనిచేస్తున్న 891 మంది ఉద్యోగులు తెలంగాణకు శాశ్వత బదిలీ కోరుతూ సుముఖత వ్యక్తం చేయగా, వారి జాబితాను ఏపీ ప్రభుత్వం తెలంగాణకు పంపించింది. ఈ ప్రతిపాదనకు తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపితే దాదాపు 12 ఏళ్లుగా కొనసాగుతున్న ఉద్యోగుల సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఇదే సమయంలో రాష్ట్రస్థాయి కార్యాలయాల ఉద్యోగులకు వారంలో ఐదు రోజుల పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది.

ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల ప్రక్రియ మళ్లీ తెరపైకి?

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలం గా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల ప్రక్రియ మళ్లీ తెరపైకి వచ్చింది. రెండు రాష్ట్రాల విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఏపీలో పని చేస్తున్న 891 మంది ఉద్యోగులు తెలంగాణకు శాశ్వత ప్రాతిపదికన వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీలో పని చేస్తున్న 891 మంది ఉద్యోగుల జాబితాను ఏపీ ప్రభుత్వం తాజాగా తెలంగాణకు పంపింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఏపీ సీఎస్ లేఖ రాశారు. తదుపరి చర్యలు తీసుకునేందుకు ఈ జాబితాను త్వరగా పరిశీలించి, అభిప్రాయాన్ని, అంగీకారం తెలియజేయాలని అందులో తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ఉద్యోగుల శాశ్వత బదిలీల ప్రక్రియ సుఖాంతం అవుతుంది. గతంలో ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లడానికి మొత్తం 1943 మంది ఆప్షన్‌ను ఎంచుకున్నారు. ఇందులో ప్రస్తుతం 891మంది ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లడానికి సిద్ధమయ్యారు.

కాగా 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఏపీ,

తెలంగాణ కు ఉద్యోగుల్ని విభజించిన సంగతి తెలిసిందే! ఈ కేటాయింపు ల్లో తెలంగాణ జిల్లాలకు చెందినవారు కొందరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. దీంతో 2014 నుంచి వారు అక్కడే కొనసాగాల్సిన పరిస్థితి వచ్చింది. పండుగలు, కుటుంబ అకేషన్స్, సెలవులు వంటి సందర్భాల్లో ఇంటికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, తమను సొంత రాష్ట్రంలో పని చేసే అవకాశం కల్పించాలని అప్పటి నుంచి ఈ ఉద్యోగులంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు ఇందులో కొంతమంది ఉద్యోగులు ప్రతి వారం శుక్రవారం సాయంత్రం ఏపీ నుంచి తెలంగాణకు వచ్చి మళ్లీ సోమవారం ఉదయం ఏపీకి చేరుకుంటున్నారు. గత 12ఏళ్లుగా ఈ సమస్య ఇలాగే కొనసాగుతోంది.ఈ క్రమంలో తాజాగా ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఏపీ సర్కార్ కీలక ముందడుగు వేసింది. దీనితోపాటు ఏపీ సర్కార్ మరో కీలక ప్రకటన కూడా చేసింది.రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల కు వారంలో 5 రోజుల పనిదినాలను మరో ఏడాది పాటూ పొడిగిస్తున్నట్లు తన ప్రకటనలో వెల్లడించింది. ఉద్యోగుల శాశ్వత బదిలీకి తెలంగాణ సర్కార్ కూడా గ్రీన్‌సిగ్నల్ వస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

మమ్మల్నీ పంపించరూ? తెలంగాణలోని ఏపీ ఉద్యోగుల విజ్ఞప్తి

తెలంగాణలోని ఏపీ ఉద్యోగులు విభజన సమయంలో ఏపీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు కూడా కొందరు తెలంగాణలో ఉండిపోయారు. వీళ్లు కూడా మమ్మల్ని ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత బదిలీ చేయమని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతు న్నారు. ఈ రెండు నిర్ణయాలపై తెలంగాణ సర్కార్ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# ఉప్పల్ లో ఓటీపీ రాకుండానే రూ.5 లక్షలు మాయం!

- బ్యాంకు ఖాతా ఖాళీ ఇద్దరి
- బ్యాంకు ఖాతాల నుంచి రూ.5.31లక్షలు
- మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు

జూన్ 22 వార్త సాక్ష్యం



సైబర్ నేరగాళ్లు మరోసారి తమ మోసపూరిత చర్యలకు పాల్పడి ఓ మహిళ బ్యాంకు ఖాతాను ఖాళీ చేశారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఓ మహిళ ఖాతా నుంచి రూ.2.32 లక్షలను పలుమార్లు బదిలీ చేసి కాజేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉప్పల్ హిల్స్ కాలనీకి చెందిన రాధిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖకునగదుఉపసంహరణ కోసం వెళ్లగా తన ఖాతాలో కేవలం రూ.16 వేలే మిగిలి ఉన్నట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన ఆమె ఖాతా స్టేట్‌మెంట్‌ను పరిశీలించగా తనకు తెలియకుండానే పలుమార్లు మొత్తం రూ.2.32 లక్షలు ఇతర ఖాతాలకు బదిలీ అయినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలకు సంబంధించి తన మొబైల్ ఫోన్‌కు ఒక్క ఓటీపీ సందేశం కూడా రాలేదని బాధితురాలు వెల్లడించారు. దీంతో వెంటనే ఆమె మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఖాతా వివరాలు ఎలా సైబర్ కేటుగాళ్ల చేతికి చేరాయనే కోణంలో విచారణ చేపట్టినట్లు సమాచారం.

# పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

జూన్ 22 వార్త సాక్ష్యం:

జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరంలో ఎక్కడ కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారులలో మురుగు జలాలు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులతో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సోమవారం ఉదయం నగరంలోని ఆయా ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. బోధన్ రోడ్, ఖిల్లా రోడ్డు, ఫ్రూట్ మార్కెట్, దేవీ థియేటర్ చౌరస్తా, ఖలీల్ వాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. స్థానికంగా నెలకొని ఉన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన మార్గాలలోని డ్రైనేజీలను పరిశీలించి, చెత్త చెదారం పేరుకుపోకుండా వెంటవెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు జలాలు నిలువ ఉండకుండా సాఫీగా ముందుకు ప్రవహించేలా డ్రైనేజీలపై గ్రిల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. వానల వల్ల రోడ్లపై ఏర్పడే గుంతలను వర్షాకాలం అనతరం తక్షణమే పూడ్చివేయించాలని, అవసరమైన చోట డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో నగర ప్రజలు ఎక్కడ కూడా ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా మంచినీటి సరఫరా తీరును నిశితంగా పర్యవేక్షణ జరపాలని అన్నారు. మరో మూడు నెలలకు అవసరాలకు సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని భరోసా కల్పించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు ఆరంభం నుండే



నాణ్యమైన విద్యను బోధించాలని ఈ సందర్భంగా హితవు పలికారు. కాగా, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఈసారి నగరంలోని అన్ని డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఒక్కో సర్కిల్ వారీగా 60 డివిజన్లలో డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేయడం, చెత్తను తరలించడం, పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలను శుభ్రం చేయడం వంటి పనులు పూర్తయ్యాయని అన్నారు. సుమారు 70 లక్షల రూపాయల వ్యయంతో మురుగు కాలువల్లో పూడికతీత పనులను కూడా వేగవంతంగా జరిపిస్తున్నామని, అవకాశం ఉన్న చోట జేసీబీల ద్వారా, మిగితా చోట్ల పారిశుద్ధ్య కార్మికులతో డీసిల్టింగ్ పనులు జరిపిస్తున్నామని తెలిపారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కార్పొరేటర్ షకీల్, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

# అశ్వారావుపేట అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న జననాయకుడు...





- జారే ఆదినారాయణ.
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే...

జూన్ 22 వార్త సాక్ష్యం ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడు, ప్రజా సమస్యల పరిష్కారానికే తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజాప్రతినిధి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ . రాజకీయాల్లో స్వార్థం, పదవులు, వ్యక్తిగత ప్రయోజనాలు కాకుండా ప్రజా సేవే పరమావధిగా భావిస్తూ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు.

**ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి ..**

అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్న జారే ఆదినారాయణ ప్రతి గ్రామం, ప్రతి వాడ, ప్రతి ఇంటి అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. ప్రజల అవసరాలను స్వయంగా తెలుసుకుంటూ గ్రామ గ్రామాన పర్యటిస్తూ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

**పాటతో ప్రజల మనసులు గెలిచిన ఎమ్మెల్యే..**

రాష్ట్ర రాజకీయాల్లో జారే ఆదినారాయణ కి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన అంశం ఆయన పాట. సాధారణంగా శాసనసభలో సభ్యులు ప్రసంగాల ద్వారా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు. అయితే జారే ఆదినారాయణ మాత్రం ప్రజల సమస్యలను పాట రూపంలో వినిపిస్తూ ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన పాటల ద్వారా ప్రజా సమస్యలు శాసనసభలో మారుమోగడం మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రజల దృష్టిని కూడా ఆకర్షించాయి. ప్రతిపక్ష సభ్యులు చేసే విమర్శలకు సమాధానాలు ఇస్తూనే, నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన చూపుతున్న చొరవ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గ్రామీణ ప్రజల భాషలో, వారి బాధలను ప్రతిబింబించే విధంగా ఆయన చేసే ప్రదర్శనలు ప్రజలకు మరింత చేరువయ్యాయి.

**ఇందిరమ్మ ఇళ్ల అమలులో ముందంజ..**

అశ్వారావుపేట నియోజకవర్గంలోని పేదలకు గృహ వసతి కల్పించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించే క్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అశ్వారావుపేట నియోజకవర్గానికి ఆహ్వానించి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా వేలాది పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించబడింది. గృహహీన కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడంలో ఎమ్మెల్యే కృషి ప్రజల ప్రశంసలను అందుకుంది.

**గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

అశ్వారావుపేట నియోజకవర్గంలో గిరిజన జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. రహదారులు లేని గ్రామాలకు రహదారులు, విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతాలకు విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యా సంస్థల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులను నిరంతరం ఆదేశిస్తూ, సమస్యలు ఎదురైనప్పుడు స్వయంగా జోక్యం చేసుకుని పరిష్కరిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా, వైద్య సదుపాయాల విస్తరణకు కృషి చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నారు.

**రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యం..**

రైతుల సమస్యలను బాగా అర్థం చేసుకున్న నాయకుడిగా జారే ఆదినారాయణ గుర్తింపు పొందారు. రైతు భరోసా, సాగునీటి సదుపాయాల మెరుగుదల, పోడు రైతుల సమస్యల పరిష్కారం, ఉచిత సోలార్ పంపుసెట్ల మంజూరు, వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతూ రైతుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నారు. రైతు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు.

**మహిళల సాధికారతకు పెద్దపీట..**

మహిళా సంక్షేమం, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి మహిళకు అందేలా ఎమ్మెల్యే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సంఘ భవనాల నిర్మాణం, ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాల ద్వారా మహిళల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

**విద్యా రంగానికి ప్రాధాన్యత**

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన సదుపాయాల కల్పన, పాఠశాల భవనాల అభివృద్ధి, హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నియోజకవర్గంలోని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు పెరగాలని భావిస్తూ విద్యా సంస్థల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

**అభివృద్ధి కోసం నిరంతర పోరాటం**

అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను తరచూ కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నారు. రోడ్లు, వంతెనలు, పంచాయతీ భవనాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, తాగునీటి పథకాలు, ఆరోగ్య కేంద్రాలు వంటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అశ్వారావుపేటను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. రానున్న రెండున్నర సంవత్సరాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సంకల్పించారు.

## యాంటీ డ్రగ్ అవేర్నెస్ "పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్...

- మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరం కలిసికట్టుగా పోరాడాలి..



జూన్ 22 వార్త సాక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నాడు "యాంటీ డ్రగ్ అవేర్నెస్" పోస్టర్లను జిల్లా ఎస్పి రోహిత్ రాజు ఐపీఎస్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్లకు పోస్టర్లు, బ్యానర్లు, యాంటీ డ్రగ్స్ సోల్జర్ సెల్ఫీ పాయింట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జూన్ 22 నుంచి 26 వరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్ పరిధిలో గల పాఠశాలలు, కళాశాలలో, పట్టణాల్లో, గ్రామాలలో మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాల పై విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. సమాజంలో మార్పు వచ్చినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించగలమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణా చేసిన వినియోగించిన అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమం లో అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొణిజర్ల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్...



జూన్ 22 వార్త సాక్ష్యం ఖమ్మం

కొణిజర్ల పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధిత ఫిర్యాదుదారులతో మాట్లాడారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాల ను పరిశీలించారు. సెక్టర్ పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు.

## బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్



జూన్ 22 వార్త సాక్ష్యం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి :

బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల కోసం ప్రత్యేక ఆరోగ్య అవగాహన,ఒత్తిడి నివారణ కార్యక్రమం నిర్వహించారు.నిరంతరం విధుల్లో నిమగ్నమై మానసిక ఒత్తిడికి గురయ్యే అధికారుల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ నిపుణులు డాక్టర్ సచిన్ ముఖ్య వక్తగా హాజరై,దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని సులభమైన పద్ధతుల ద్వారా ఎలా అధిగమించవచ్చో వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ...ప్రజలకు సేవలు అందించే క్రమంలో ప్రభుత్వ అధికారులు,సిబ్బంది నిరంతరం ఒత్తిడికి లోనవుతుంటారని, అందువల్ల తమ శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. రాజయోగ మెడిటేషన్, సరళమైన వ్యాయామాలు, ధ్యానం వంటి పద్ధతుల ద్వారా ఒత్తిడిని అధిగమించి మరింత ఉత్సాహం తో, సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చని తెలిపారు. అధికారుల సంక్షేమం కోసం ఈ సదస్సును నిర్వహించిన బ్రహ్మకుమారీస్ సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో భాగంగా "ఈజీ స్ట్రెస్ మేనేజ్ మెంట్ స్కిల్స్", మెడిటేషన్(ధ్యానం), రిలాక్సేషన్‌కు సంబంధించిన పలు అంశాలను అధికారులకు వివరించి, ప్రత్యక్షంగా సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్,శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి బి.సునీత, ఇతర జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A0153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం.. ఏఐతో భారీ డిమాండ్!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆసియాలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ అవతరిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాక్స్ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని యువ జనాభా, అపారమైన ఇంజినీరింగ్ నైపుణ్యం కలిగిన మానవవనరులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఈ రంగానికి మరింత ఊతమిస్తున్నాయని వివరించింది. దేశంలో ముంబై, చెన్నై నగరాలు డేటా సెంటర్లకు ప్రధాన గమ్యస్థానాలుగా మారాయి. సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల లభ్యత ఇందుకు ప్రధాన కారణం కాగా, ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు నగరాలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు పశ్చిమాసియా దేశాలకు వ్యూహాత్మకంగా చేరువలో ఉండటం కూడా భారత్‌కు కలిసొచ్చే అంశమని నివేదిక పేర్కొంది. ఈ రంగానికి సంబంధించిన తాజా గణాంకాలు కూడా ఇదే వృద్ధిని ధ్రువీకరిస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యం గత ఏడాది చివరి నాటికి 1.6 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం మరో 0.32 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు నిర్మాణ దశలో ఉండగా, 2.92 గిగావాట్ల సామర్థ్యం పనుల కోసం వివిధ సంస్థల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

## 2030 నాటికి భారతీయులు ఎక్కువగా ఖర్చు చేసేది వీటి కోసమేనట!

- 2030 నాటికి అనుభవాలపై ఖర్చు మరింత పెరిగే అవకాశం
- ట్రావెల్, హోటళ్లు, రెస్టారెంట్లకు అధిక ప్రాధాన్యం
- వస్తువుల కంటే అనుభవాలపై ఎక్కువ ఆసక్తి
- హోటల్ ఖర్చులు 10.6% వృద్ధితో పెరిగే అంచనా
- జెన్‌జీ తరం ఈ మార్పుకు ప్రధాన కారణం



ఒకప్పుడు కొత్త ఫోన్, టీవీ, ఫర్నీచర్ కొనడం అనేవి ముఖ్యమైన విషయాలు. ఇప్పుడు మాత్రం చాలామంది డబ్బును వస్తువుల కంటే అనుభవాల కోసం ఖర్చు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రయాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. రాబోయే ఐదేళ్లలో ఈ ధోరణి మరింత బలపడనుందని రియల్ ఎస్టేట్ సేవలు, పెట్టుబడుల సంస్థ సీబీఆర్ఈ రీసెర్చ్ అధ్యయనం చెబుతోంది. 2030 నాటికి భారతీయులు వస్తువుల కంటే అనుభవాలపైనే ఎక్కువగా ఖర్చు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

### ప్రయాణాలకే పెద్ద పీట

ఈ నివేదిక ప్రకారం 2025-2030 మధ్య కాలంలో భారతీయుల అనుభవాలపై (ఎక్స్‌పీరియెన్సెస్) ఖర్చు వేగంగా పెరగనుంది. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, పర్యటనలపై వ్యయం వార్షికంగా 10.3 శాతం వృద్ధి రేటుతో పెరుగుతుందని అంచనా వేసింది. ఇక భౌతిక వస్తువులపై ఖర్చు 9.1 శాతం వృద్ధి రేటుతో పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా హోటల్ వసతి ఖర్చులు 10.6 శాతం వృద్ధితో మరింత వేగంగా పెరుగుతాయని నివేదిక పేర్కొంది.

### జెన్‌జీ ప్రభావం

ఈ మార్పునకు ప్రధాన కారణం జెన్‌జీ తరమేనని నివేదిక వెల్లడించింది. సోషల్ మీడియాలో పంచుకునేలా ప్రత్యేక అనుభవాలు, ఆకర్షణీయమైన ప్రదేశాలు, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే హోటళ్లకు యువత ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణ వసతి కంటే ప్రత్యేక అనుభూతిని అందించే లైఫ్‌స్టైల్ హోటళ్లకు డిమాండ్ పెరుగుతోంది. వైన్ టేస్టింగ్, సంగీత కార్యక్రమాలు, స్థానిక కళా ప్రదర్శనల వంటి కార్యక్రమాలు నిర్వహించే హోటళ్లను యువ పర్యాటకులు ఎక్కువగా ఎంచుకుంటున్నారు.

### కొత్త ట్రెండ్‌గా లైఫ్‌స్టైల్ హోటళ్లు

ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 2015 నుంచి 2025 మధ్య మొత్తం హోటళ్ల సంఖ్య 5 శాతం వృద్ధి రేటుతో పెరిగితే, లైఫ్‌స్టైల్ హోటళ్లు 19 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2030 వరకు కూడా ఈ విభాగం వేగంగా విస్తరించే అవకాశముందని నివేదిక తెలిపింది. భారత్‌లో ఈ తరహా హోటళ్ల సంఖ్య ఇంకా తక్కువగానే ఉండటంతో పెట్టుబడిదారులు, డెవలపర్లకు విస్తృత అవకాశాలు ఉన్నాయని విశ్లేషించింది. ఇప్పటికే ఉన్న హోటళ్లను ఆధునిక లైఫ్‌స్టైల్ హోటళ్లుగా మార్చే ధోరణి కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

## ఐటీ, ఫార్మా జోష్.. లాభాల్లో ముగిసిన మార్కెట్లు

చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, ఐటీ-ఫార్మా షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. రోజులో ఎక్కువ భాగం ఒడుదొడుకులు కనిపించినప్పటికీ చివరికి కీలక సూచీలు పాజిటివ్‌గానే స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 291 పాయింట్లు పెరిగి 77,094 వద్ద ముగిసింది. నిఫ్టీ 90 పాయింట్లు లాభపడి 24,102 వద్ద స్థిరపడింది. ఐటీ, ఆరోగ్య రంగ షేర్లు మార్కెట్‌కు దన్నుగా నిలిచాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, సిప్లా, డాక్టర్ రెడ్డీస్ వంటి షేర్లు రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.6 శాతం పెరిగాయి. దీంతో పెద్ద కంపెనీలతో పాటు మధ్య, చిన్న తరహా షేర్లపైనా పెట్టుబడిదారుల ఆసక్తి కనిపించింది. ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. కీలక ఆర్థిక పరిణామాలపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ చమురు ధరల తగ్గుదల సానుకూల ప్రభావం చూపిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.



## మహిళా క్రికెటర్లకు ఐసీసీ గుడ్ న్యూస్... ప్రెగ్నెన్సీ తర్వాత ఆడేందుకు కొత్త గైడ్‌లైన్స్

- ప్రసవం తర్వాత మహిళా క్రికెటర్లు తిరిగి ఆడేందుకు ఐసీసీ మార్గదర్శకాలు
- '6-R' ఫార్ములాతో దశలవారీగా పునరాగమనానికి ప్రణాళిక
- మాతృత్వం, కెరీర్ రెండూ కొనసాగించేలా ప్రోత్సాహం
- ప్రతి క్రీడాకారిణికి ప్రత్యేక కేస్ మేనేజర్, వైద్య బృందం
- ఆటగాళ్ల వ్యక్తిగత గోప్యత, ఆరోగ్యానికే పెద్దపీట

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సోమవారం మహిళా క్రికెటర్ల కోసం ఒక కీలకమైన ముందడుగు వేసింది. ప్రసవం తర్వాత తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వీలు కల్పించే మార్గదర్శకాలను (గైడ్‌లైన్స్) విడుదల చేసింది. మాతృత్వం కారణంగా మహిళా క్రికెటర్ల కెరీర్ ముగిసిపోకూడదనే లక్ష్యంతో, వారికి అవసరమైన మద్దతును అందించేందుకు ఈ కొత్త పాలసీని తీసుకొచ్చింది. మాతృత్వం, ప్రొఫెషనల్ క్రికెట్ రెండూ ఏకకాలంలో సాధ్యమేనని చాటిచెప్పడం ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. ఈ గైడ్‌లైన్స్‌లో భాగంగా '6-R' ఫార్ములాను ఐసీసీ ప్రతిపాదించింది. ఇందులో రెడీ (సిద్ధం కావడం), రివ్యూ (సమీక్ష), రీస్టోర్ (పునరుద్ధరణ), రీకండిషన్ (పునఃస్థితికి తీసుకురావడం), రిటర్న్ (తిరిగి ఆడటం), రిఫైన్ (మెరుగుపరచడం) అనే ఆరు దశలు ఉంటాయి. శారీరకంగా కోలుకోవడం నుంచి మొదలుకొని, వైద్య సమీక్షలు, నెమ్మదిగా శిక్షణ ప్రారంభించడం, క్రికెట్‌కు అవసరమైన కండిషనింగ్ సాధించడం, పోటీల్లోకి తిరిగి రావడం, ఆ తర్వాత కూడా ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం వరకు ప్రతీ అంశాన్ని ఈ ప్రణాళికలో పొందుపరిచారు. ఆస్ట్రేలియా జట్టు డాక్టర్, ఐసీసీ మెడికల్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలు డాక్టర్ ఫిలిప్పా ఇంగే మాట్లాడుతూ, "ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం.. బిడ్డకు జన్మనివ్వడం కెరీర్‌కు ముగింపు కాదని క్రీడాకారిణులకు భరోసా ఇవ్వడమే. చాలా దేశాల బోర్డులకు గతంలో ఇలాంటి పాలసీలు లేవు. అందుకే అన్ని దేశాలకూ అనుకూలంగా ఉండేలా, వారి అవసరాలకు తగ్గట్టు మార్చుకునేలా ఈ గైడ్‌లైన్స్‌ను రూపొందించాం. ఇది ఒక టెంప్లేట్ లాంటిది. ప్రతి క్రీడాకారిణీ, వారి కుటుంబ అవసరాలకు అనుగుణంగా మద్దతు అందించాలి" అని వివరించారు. ఈ మార్గదర్శకాల ప్రకారం, ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్‌ను నియమించాలని సిఫార్సు చేశారు. సాధారణంగా డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ ఈ బాధ్యతలు చూస్తారు. గర్భం దాల్చినప్పటి నుంచి తిరిగి మైదానంలోకి అడుగుపెట్టే వరకు వీరే ఆమెకు ప్రతినిధిగా వ్యవహరిస్తారు. అంతేకాకుండా, మెడికల్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు, సైకాలజిస్టులు, డైటీషియన్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులతో కూడిన ఒక బృందం క్రీడాకారిణికి అండగా నిలవాలని ఐసీసీ సూచించింది. ఆటగాళ్ల వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతకు ఐసీసీ పెద్దపీట వేసింది. గర్భం దాల్చిన విషయాన్ని ఎప్పుడు ప్రకటించాలనే నిర్ణయం పూర్తిగా క్రీడాకారిణిదేనని స్పష్టం చేసింది. సభ్య దేశాల బోర్డులు తప్పనిసరిగా ప్రెగ్నెన్సీ టెస్టులు చేయించరాదని నిర్దేశించింది. గర్భధారణ



సమయంలో వ్యాయామాన్ని ప్రోత్సహించినప్పటికీ, శిక్షణ, పోటీలకు సంబంధించిన నిర్ణయాలు వైద్యుల సంప్రదింపులతోనే తీసుకోవాలని పేర్కొంది. సాధారణంగా మొదటి త్రైమాసికం తర్వాత పోటీలకు దూరంగా ఉండాలని సూచించినా, ఎప్పటివరకు ఆడాలనే దానిపై కచ్చితమైన నిబంధన ఏదీ లేదని స్పష్టం చేసింది. 2021లో కుమారుడికి జన్మనిచ్చి, ప్రస్తుతం 2026 మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న వెస్టిండీస్ లెగ్ స్పిన్నర్ అఫీ ఫ్లెచర్ ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. "మహిళల కోసం ఐసీసీ ఇలాంటి పాలసీని తీసుకురావడం గొప్ప విషయం. దీనివల్ల కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే కెరీర్‌ను కొనసాగించవచ్చు. శారీరకంగా కోలుకోవడం సవాలుగా అనిపించింది. అంతకంటే ఎక్కువగా నా బిడ్డను వదిలి వెళ్లడం నన్ను చాలా బాధపెట్టింది. అందుకే మైదానంలో ప్రతీ క్షణం వాడి కోసమే ఆడతాను. ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుంది. సరైన మద్దతుతో ఆరోగ్యంగా మారి, ప్రక్రియను నమ్మాలి" అని ఆమె తన అనుభవాన్ని పంచుకున్నారు. శిక్షణా వాతావరణంలో వెసులుబాటు, శిశువు సంరక్షణకు సలహాలు, మైదానంలో పిల్లలకు పాలివ్వడానికి లేదా చూసుకోవడానికి అనువైన గదులు, ప్రయాణ సౌకర్యాలు వంటి ఆచరణాత్మక మద్దతును కూడా ఈ మార్గదర్శకాలలో చేర్చారు. మహిళా క్రికెట్ అభివృద్ధికి తగ్గట్టుగా వారికి మెరుగైన వాతావరణం కల్పించడం చాలా అవసరమని ఐసీసీ ప్రతినిధి తెలిపారు.

# స్పోర్ట్స్

## ఐపీఎల్‌లో మెగా ట్రేడ్.. ముంబైని వీడనున్న హార్దిక్.. జైస్వాల్ పై ఎంఐ కన్ను!



ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. కెప్టెన్‌గా విఫలమైన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టును వీడటం దాదాపు ఖాయమైంది. అతని స్థానంలో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ట్రేడింగ్ ద్వారా జట్టులోకి తీసుకురావాలని ముంబై యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు జాతీయ క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గుజరాత్ టైటాన్స్ నుంచి భారీ అంచనాలతో ముంబైకి తిరిగివచ్చిన హార్దిక్ పాండ్యా, కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జట్టును సమర్థంగా నడిపించలేకపోయాడు. జట్టు ప్రదర్శన పేలవంగా ఉండటంతో పాటు, డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా విభేదాలు తలెత్తినట్టు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ముంబై ఇండియన్స్‌తో తన ప్రయాణాన్ని ముగించుకోవాలని హార్దిక్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా ను రాజస్థాన్ రాయల్స్‌కు ఇచ్చి, ప్రతిగా యశస్వి జైస్వాల్‌ను తీసుకునేందుకు ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు చివరి దశలో ఉన్నాయని సమాచారం. మరోవైపు యశస్వి జైస్వాల్ కూడా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీతో సంతోషంగా లేనట్టు తెలుస్తోంది. సంజూ శాంసన్ నిష్క్రమణ తర్వాత జట్టులో కీలక ఆటగాడిగా, కెప్టెన్సీ రేసులో జైస్వాల్ ముందుంటాడని భావించారు. అయితే, యాజమాన్యం అతని స్థానంలో రియాన్ పరాగ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. దీనికి తోడు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రాకతో జైస్వాల్ ప్రాధాన్యం తగ్గినట్టు భావిస్తున్నారు.

# తనకు పుట్టబోయే పిల్లల పై గతంలో సమంత చేసిన వ్యాఖ్యలు వైరల్

- సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతున్న సమంత 'మా ఇంటి బంగారం'
- సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో బేబీ బంప్‌తో కనిపించిన సామ్
- తన బిడ్డే తన ప్రపంచం అవుతుందని గతంలో చెప్పిన సమంత



స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం అటు ప్రొఫెషనల్ లైఫ్‌లో, ఇటు పర్సనల్ లైఫ్‌లో ఫుల్ హ్యాపీ మోడ్‌లో ఉన్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె లీడ్ రోల్‌లో నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. మరోవైపు ఆమె పర్సనల్ లైఫ్‌కు సంబంధించి ఒక క్రేజీ గుడ్ న్యూస్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తాజాగా జరిగిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సమంత బేబీ బంప్‌తో కనిపించడంతో అభిమానులు ఒక్కసారిగా షాక్‌తో కూడిన ఆనందానికి లోనయ్యారు. ఈ విషయంపై ఆమె సన్నిహిత వర్గాలు స్పందిస్తూ.. సమంత, రాజ్‌లకు ఇది చాలా ప్రత్యేకమైన సమయమని, వారిద్దరూ లైఫ్‌లో ఒక కొత్త జర్నీకి సిద్ధమవుతున్నారంటూ ఇన్‌సైడ్ లీక్ ఇచ్చారు. దీనిపై సామ్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కోసం ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. మరోవైపు, గతంలో ఒక ఇంటర్వ్యూలో తన పిల్లల గురించి సామ్ మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. "నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది. చిన్నప్పుడు నేను ఎన్నో కష్టాలు పడ్డాను. అలాంటి బాల్యం గడిపిన వారంతా తమ పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా విలాసవంతమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని ఇవ్వాలను కుంటారు. నేను కూడా అదే ఫిక్స్ అయ్యాను. నా బిడ్డ పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు సినిమాలను పక్కన పెట్టి, తనను వదిలి ఎక్కడికీ వెళ్లను. తనే నా సర్వస్వంగా చూసుకుంటా" అంటూ అప్పట్లోనే సామ్ తన మనసులోని మాటను బయటపెట్టింది.

## మెగాస్టార్ చిరంజీవిని కలిసిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు, మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు కలిశారు. చిరంజీవి నివాసానికి వెళ్లిన రాంచందర్ రావు... ఆయనతో భేటీ అయ్యారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'మహా జన్ సంపర్క్ అభియాన్' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులను కలిసి మోదీ ప్రభుత్వ విజయాలను వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే రామచందర్ రావు.. మెగాస్టార్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రగతికి సంబంధించిన ఒక స్పెషల్ బుక్, బ్రోచర్లను అందజేశారు. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ సమావేశంలో దేశ ఆర్థిక పురోగతి, సాంస్కృతిక పునరుజ్జీవనం, వినోద రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిణామాలపై ఇరు ప్రముఖుల మధ్య ఆసక్తికర చర్చ సాగినట్లు సమాచారం. అయితే ఈ భేటీ కేవలం మర్యాదపూర్వకమైనదేనని, ప్రభుత్వ 12 ఏళ్ల విజయాల బుక్‌లెట్‌ను అందించడానికే కలిశామని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.


## శ్రీలీలను అమృత ఫడ్నవీస్ అవమానించారా... ఆ వీడియోలో ఏముంది



మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృతా ఫడ్నవీస్ మరోసారి వార్తల్లో నిలిచారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ టాలీవుడ్ నటి శ్రీలీల పట్ల ఆమె ప్రవర్తించిన తీరుపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫోటోల కోసం శ్రీలీలను పక్కకు జరగమని అమృత సైగలు చేస్తున్న వీడియో ఒకటి ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే, యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అమృతా ఫడ్నవీస్, ఆమె కుమార్తె దివిజతో పాటు నటి శ్రీలీల, షాహిద్ కపూర్ పాల్గొన్నారు. కార్యక్రమం ముగిశాక అందరూ కలిసి ఫోటోలకు పోజులిచ్చారు. ఈ క్రమంలో కేవలం అమృత, ఆమె కుమార్తె ఫోటోలు కావాలని కొందరు ఫొటోగ్రాఫర్లు అడిగినట్లు సమాచారం. దీంతో అమృతా ఫడ్నవీస్ తన పక్కనే ఉన్న శ్రీలీలను చేతితో సైగ చేసి పక్కకు జరగమని సూచించారు. ఈ అనూహ్య పరిణామంతో శ్రీలీల కాస్త ఇబ్బందికి గురైనట్లు కనిపించింది. వెంటనే ఆమె పక్కకు జరగగా, ఆ దృశ్యాలు వీడియోలో రికార్డ్ అయ్యాయి. ఈ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు అమృతా ఫడ్నవీస్ పై మండిపడుతున్నారు.

# నా కెరీర్‌కు థియేటరే పునాది.. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం అదే: విజయ్ దేవరకొండ


- నటనపై తన ఆసక్తిని రంగస్థలంపైనే కనుగొన్నానన్న విజయ్
- కెరీర్ ప్రారంభంలో ఎలాంటి అవకాశం వచ్చినా చేసేవాడినని వెల్లడి
- నటుడిగా, వ్యక్తిగా తనను థియేటర్ తీర్చిదిద్దిందని వ్యాఖ్య
- భార్య రష్మికతో కలిసి 'రణబాలి' చిత్రంలో నటిస్తున్న విజయ్



ప్రముఖ టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తన నటన ప్రస్థానం గురించి, కెరీర్ తొలినాళ్లలోని అనుభవాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నటనపై తనలో ఆసక్తిని పెంచడంలో, తనను తాను నటుడిగా తీర్చిదిద్దుకోవడం లో థియేటర్ (రంగస్థలం) కీలక పాత్ర పోషించిందని ఆయన వెల్లడించారు. తన కెరీర్‌కు థియేటర్ అనుభవమే బలమైన పునాది వేసిందని స్పష్టం చేశారు. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ విజయ్ మాట్లాడుతూ.. "కెరీర్ ప్రారంభంలో ఫలానా ప్రాజెక్ట్ చేయాలని ఎంచుకునే అవకాశం నాకు లేదు. ఏ పని దొరికినా, ఏ వేదిక దొరికినా దాన్ని సద్వినియోగం చేసుకోవాలనే తపన మాత్రమే ఉండేది. నా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, నా ప్రతిభను ప్రజలకు చూపించడానికి ఏదో ఒక అవకాశం కావాలి అనుకునేవాడిని" అని వివరించారు. చిన్న వయసులోనే తనలోని శక్తిని సరైన మార్గంలో పెట్టేందుకు రంగస్థలం ఎంతగానో దోహదపడిందని విజయ్ తెలిపారు. నటుడిగా, వ్యక్తిగా తనను తీర్చిదిద్దడంలో థియేటర్ పాత్ర ఎంతో ఉందని అన్నారు. థియేటర్ మనలోని బంధనాలను తెంచి, మనకు స్వేచ్ఛను ఇస్తుందని, నటుడిగా పూర్తిగా విముక్తి కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇక, విజయ్ కెరీర్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తన భార్య, నటి రష్మిక మందన్నతో కలిసి 'రణబాలి' అనే పీరియాడిక్ డ్రామాలో నటిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న మూడో చిత్రమిది. వివాహం తర్వాత వీరిద్దరూ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనుండటం ఇదే తొలిసారి కావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. 1850ల నాటి వాస్తవ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. చరిత్ర పుస్తకాల్లోకి ఎక్కని, బ్రిటిష్ వారు తప్పుగా చిత్రీకరించారని ఆరోపణలున్న కొన్ని ఘటనలను ఈ సినిమా వెలుగులోకి తీసుకురానుందని సమాచారం. ఈ చిత్రంతో పాటు 'రౌడీ జనార్దన', 'శౌర్యువ్ (వర్కింగ్ టైటిల్)' అనే మరో రెండు ప్రాజెక్టులు కూడా విజయ్ చేతిలో ఉన్నాయి.

# తన సినిమా ఆలస్యం కావడం పై సాయి దుర్గా తేజ్ క్లారిటీ

మెగా హీరో సాయి దుర్గా తేజ్ నటిస్తున్న పాన్-ఇండియా పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటిగట్టు' చుట్టూ టాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా రకరకాల రూమర్స్ నడుస్తున్నాయి. షూటింగ్ స్టార్ట్ అయి చాలా రోజులు కావడం, గ్లింప్స్ మినహా ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో ఈ సినిమాపై రకరకాల పుకార్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రాజెక్ట్ వాయిదాలపై వస్తున్న పుకార్లకు సాయి దుర్గా తేజ్ తాజాగా ఒక ఈవెంట్‌లో ఫుల్ క్లారిటీ ఇచ్చారు. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని 'హనుమాన్' ఫేమ్ నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తుండగా.. జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్ వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా.. 1980ల నాటి రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో, అణచివేతకు గురయ్యే గిరిజనుల కోసం ఎదురుతిరిగే 'బాలి' అనే పవర్‌ఫుల్ గిరిజన నాయకుడి కథాంశంతో వస్తోంది. సినిమా ఆలస్యంపై తేజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నో విభిన్నమైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లను విరివిగా చూస్తున్నారని గుర్తుచేశారు. రకరకాల జానర్లలో వస్తున్న సరికొత్త కంటెంట్‌ను ఫాలో అవ్వడం వల్ల, ఆడియన్స్‌కు సినిమా మేకింగ్, కథలపై ఎంతో నాలెడ్జ్ పెరిగిందని, వారి ఆలోచనా విధానంలో చాలా మార్పులు వచ్చాయని చెప్పారు. ప్రేక్షకులకు ఉన్న ఈ నాలెడ్జ్ వల్లే, ఇప్పుడు తన సినిమాల విషయంలో తాను చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తేజ్ వెల్లడించారు. పాతకాలపు రొటీన్ కథలను ఇప్పుడు జనాలు అస్సలు ఆదరించడం లేదని, వారిని మెప్పించాలంటే కథల ఎంపిక, మేకింగ్‌లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. కేవలం సినిమాలు చేయాలనే తొందరతో కాకుండా, ఒక సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే ఉద్దేశంతోనే 'సంబరాల ఏటిగట్టు' విషయంలో లేట్ అయినా సరే.. పక్కా కంటెంట్‌తోనే వస్తానని స్పష్టం చేశారు.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.